సమాచారం

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హఫీజ్‌పేట్ : మాతృశ్రీనగర్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతులు, చెట్ల కొమ్మల తొలగింపు ప్రక్రియలో భాగంగా గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ రాజేందర్ పేర్కొన్నారు.

- మాతృశ్రీనగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 09.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు మాతృశ్రీనగర్ పూర్తిగా, కల్వరి టెంపుల్ రోడ్డు ఏరియాలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- మాధవనగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు మాధవనగర్, మియాపూర్ ప్రధాన రోడ్డు కొన్ని ఏరియాలు, కల్వరి టెంపుల్ ప్రాంతాలలో విద్యుత్ ఉండదని ఏఈ రాజేందర్ తెలిపారు.

గోపన్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో..
గచ్చిబౌలి: గోపన్‌పల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాను గురువారం నిలిపివేస్తున్నట్లు గచ్చిబౌలి ఏఈ పివిబి వేణుగోపాల్ తెలిపారు. ఉదయం11 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు తాజ్‌నగర్, సోఫాకాలనీ, వాకస్ విల్లాస్, గోపన్‌పల్లి తండా, ఎన్‌టీఆర్ కాలనీ, గోపన్‌పల్లి గ్రామం, మంజీరా టవర్స్, ప్రతిమ విల్లాస్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు, వినియోగదారులు గమనించాలని ఆయన కోరారు.

ఓల్డ్ ముంబాయి రోడ్డు ఫీడర్ పరిధిలో..
మియాపూర్: ఓల్డ్ ముంబాయి రోడ్డు ఫీడర్ మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని ఏఈ రాజ్‌కుమార్ తెలిపారు.గురువారం ఉదయం 8గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు నేషనల్ హైవే ఫ్లైఓవర్ బ్రిడ్జీ నిర్మాణంలో భాగంగా చందానగర్ మెయిన్‌రోడ్డు, బీహెచ్‌ఈఎల్ ఏరియా, వేముకుంట, ఓల్డ్ ముంబాయి రోడ్డు ఏరియా ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

నేడు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

హఫీజ్‌పేట్ : మాదాపూర్ డివిజన్ పరిధిలో సుమారు రూ.4.58 కోట్లతో అభివృద్ధి పనులకు గురువారం శంకుస్థాపన చేయనున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్‌లో సీసీ రోడ్డు, మాతృశ్రీనగర్‌లో ఫుట్‌పాత్, టేబుల్ డ్రైన్, శిల్పా పార్కు కాలనీలో ఓపెన్ జిమ్, చంద్రనాయక్ తండా, సాయినగర్, అయ్యప్ప సొసైటీ కాలనీలో సీసీ రోడ్డు, జిమ్ నిర్మాణ పనులకు శంకుస్థాపన జరుగుతుందన్నారు.

హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో....
హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో సుమారు రూ.4.37 కోట్లతో.. ఓల్డ్ హఫీజ్‌పేట్, యూత్ కాలనీ, సాయినగర్ కాలనీ, యూత్ కాలనీ, తలారి బస్తీ, గంగారం, హుడా కాలనీ, ఆర్టీసీ కాలనీ, శాంతినగర్ కాలనీలలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు తెలిపారు.

'మనూ' పరిశోధక విద్యార్థినికి పీహెచ్‌డీ

రాయదుర్గం: మనూలో పరిశోధక విద్యార్థిని సారాబటూల్‌కి పీహెచ్‌డీ డిగ్రీని బుధవారం ప్రకటించారు. ఉర్దూ విశ్వవిద్యాలయంలోని ఉర్దూ విభాగంలో పీహెచ్‌డీ పరిశోధక విద్యార్థిని సారాబటూల్ ఉర్దూ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ బిబి రజాఖాతూన్ పర్యవేక్షణలో పీహెచ్‌డీ పూర్తి చేశారు. ఆమె 'రియాసత్ జమ్మూ-ఓ-కశ్మీర్ మే గైర్ అఫ్సాన్వి అదాబ్ కా తంఖీదీ తజ్జియా' అనే అంశంపై పీహెచ్‌డీ థీసిస్‌ను సమర్పించారు.

ముగిసిన ఫ్యాకల్టీ ఇండక్షన్ ప్రోగ్రామ్

రాయదుర్గం: మనూలో యూజీసీ-హ్యూమన్ రిసోర్స్ డెవలప్‌మెంట్ సెంటర్(హెచ్ఆర్‌డీసీ) ఆధ్వర్యంలో నెలపాటు నిర్వహించిన ఫ్యాకల్టీ ఇండక్షన్ ప్రోగ్రామ్(ఎఫ్ఐపీ) బుధవారంతో ముగిసింది. ముగింపు కార్యక్రమంలో వీసీ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్ మాట్లాడుతూ 98 సెషన్ల ద్వారా శిక్షణను నిర్వహించడం జరిగిందని నెలరోజులపాటు సాగిన కార్యక్రమంలో ఉన్నత విద్య, పర్యావరణ వ్యవస్థ, పాఠ్య ప్రణాళిక రూపకల్పన, ఫలితాల ఆధారిత అభ్యాసం, ఎంపిక, ఆధారిత క్రెడిట్ సిస్టమ్, బోధన, అభ్యాసం, మూల్యాంకనం, బోధన, మూల్యాంకనం కోసం సాంకేతికతలపై శిక్షణ సాగింది.

ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు అందిస్తాం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ప్రతీ ఇంటికి రక్షిత మంచినీరు అందిస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి పేర్కొన్నారు. అమీన్‌పూర్‌లోని శ్రీ షిరిడి సాయి కాలనీలో మిషన్ భగీరథ ద్వారా ఏర్పాటు చేసిన నల్లా కనెక్షన్లను ఆయన ప్రారంభించారు. అనంతరం జవహర్‌నగర్‌లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ.9లక్షలతో అభివృద్ధి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...అన్ని వర్గాల సంక్షేమమే లక్ష్యంగా ప్రభుత్వం పని చేస్తోందన్నారు. విద్య, వైద్యం, పారిశ్రామిక రంగాల్లో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని చెప్పారు. కృష్ణారెడ్డిపేటలో సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి, ఎంపీపీ దేవానందం, జెడ్పీటీసీ సుధాకర్ రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ నరసింహ గౌడ్, సర్పంచ్ శ్రీకాంత్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పన్ను నాలుగింతలు!

- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- ఆందోళనలు చేసినా ఫలితం శూన్యం

జిన్నారం(పటాన్‌చెరు): దేశంలోని ఆయా రాష్ట్రాల ప్రజలు పటాన్‌చెరు ప్రాంతంలోని పారిశ్రామిక వాడల్లో వేల సంఖ్యలో నివసిస్తున్నారు. కార్మికులుగా విధులు నిర్వర్తిస్తూ జీవనాన్ని సాగిస్తున్నారు. ఇటీవల ప్రభుత్వం భారీగా పన్నులు పెంచటంతో కార్మికులు, నిరుపేద ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పెంచిన పన్నులను తగ్గించాలని డిమాండ్ చేస్తున్నారు. నాలుగు రెట్లు పన్నులు పెంచటంపై ప్రజలు భగ్గుమంటున్నారు.

- జిన్నారం మండలంలోని బొల్లారం మున్సిపల్ పరిధిలో 50 వేలకు పైగా జనాభా ఉంటుంది. బొల్లారం గ్రామ పంచాయతీ స్థాయి నుంచి మున్సిపాలిటీగా ఆవిర్భవించింది. ఇక్కడ దాదాపు 200 వరకు వివిధ రకాల పరిశ్రమలు ఉంటాయి. దేశంలోని దాదాపు అన్ని రాష్ట్రాల ప్రజలు ఇక్కడి పరిశ్రమల్లో పనులు చేస్తున్నారు.
- ప్రస్తుతం మున్సిపల్ పరిధిలో ఆస్తి పన్నుల పెంపు ప్రజలకు భారంగా మారింది. రెండు గదుల రేకుల ఇంటికి గతంలో పన్ను రూ.500 ఉండగా ప్రస్తుతం రూ.2 వేలు వసూలు చేస్తున్నారు. మున్సిపల్ పరిధిలో ప్రాంతాలను బట్టి అధికారులు పన్నులను వివిధ రకాలుగా వసూలు చేస్తున్నారు. పన్నుల వాసూలుపై ఎలాంటి సమాచారం లేకపోవటంతో ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- మున్సిపాలిటీ పరిధిలో అధిక శాతం ప్రజలు వంద గజాలలోపు స్థలాల్లో రేకుల ఇళ్లలో నివసిస్తున్నారు. గతంలో ఖాళీ స్థలాలకు ఎలాంటి పన్నులు విధించని అధికారులు, ప్రస్తుతం


పన్నులు తగ్గించాలని ఆందోళన చేస్తున్న కౌన్సిలర్లు, ప్రజలు (ఫైల్)


బొల్లారం మున్సిపల్ వ్యూ

ఖాళీ స్థలాలకు కూడా పన్నులను విధిస్తున్నారు. మున్సిపాలిటీకి సంబంధించి నికర ఆస్తి విలువ ఆధారంగానే పన్నులను పెంచినట్లు అధికారులు చెబుతున్నారు.

కౌన్సిలర్ల ఆందోళన

ఆస్తి పన్ను పెంచడంతో ఇటీవల బీఆర్ఎస్‌కు చెందిన కౌన్సిలర్లు చంద్రారెడ్డి, హన్మంత్‌రెడ్డి, చంద్రయ్యలతో పాటు స్థానిక నాయకులు మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ప్రజలతో కలిసి పెంచిన పన్నులను తగ్గించాలని డిమాండ్ చేశారు.

ఎమ్మెల్యేకు సమస్యను వివరిస్తా..



ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డికి పన్నుల పెంపు విషయమై వివరిస్తా. మున్సిపల్ పరిధిలో పేద ప్రజలు ఎక్కువ ఉండటంతో వారికి పన్ను పెంపు భారంగా మారింది. మున్సిపల్ పరిధిలో అనేక సమస్యలను పరిష్కరించేలా ముందుకుసాగుతున్నాం.
– చంద్రారెడ్డి, కౌన్సిలర్

ఏరియాను బట్టి పన్ను విధిస్తున్నాం

ఇంటి విస్తీర్ణం, నిర్మాణం ఆధారంగా పన్నులు విధిస్తున్నాం. ప్రభుత్వ పాలసీ ప్రకారం ముందుకెళ్తున్నాం. భువన్ యాప్‌లో ప్రతి ఇంటికీ సంబంధించిన సమాచారం ఉంది. ప్రజలు కూడా సహకరించాలి.
– శ్రీధర్‌రావు, ఆర్వో, బొల్లారం మున్సిపాలిటీ

ప్రభుత్వ విద్యాసంస్థలకు కొత్త రూపు..

- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా మౌలిక వసతుల కల్పన
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి


పనుల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రవేశపెట్టిన 'మన ఊరు- మనబడి' విద్యారంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుడుతోందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు మండలం ఇస్నాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో రూ.51 లక్షలతో పునర్నిర్మాణ పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు. పాఠశాల ప్రాంగణంలో చేపట్టిన అభివృద్ధి పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... గత ప్రభుత్వాల హయాంలో నిర్లక్ష్యానికి గురైన విద్యారంగం సీఎం కేసీఆర్ నాయకత్వంలో జీవం పోసుకుంటుందన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో అడ్మిషన్ల కోసం పోటీ పడాల్సిన పరిస్థితులు ఉత్పన్నమయ్యాయన్నారు. పటాన్‌చెరు నియోజకవర్గ పరిధిలోని 55 ప్రభుత్వ పాఠశాలల్లో మన ఊరు మనబడి పనులు ప్రారంభించారన్నారు. ప్రభుత్వం ఒక్కో విద్యార్థిపై రూ.లక్ష ఖర్చు చేస్తోందన్నారు. అనంతరం ఉపాధ్యాయులు, విద్యార్థులు ఎమ్మెల్యే జీఎంఆర్‌ను ఘనంగా సన్మానించారు. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. కార్యక్రమంలో ఎంపీపీ సుష్మా శ్రీ, వేణుగోపాల్ రెడ్డి, జెడ్పీటీసీ సుప్రజా వెంకట్‌రెడ్డి, సర్పంచ్ బాలమణి శ్రీశైలం, ఎంపీటీసీలు శ్రీశైలం, అంజిరెడ్డి, ప్రత్యేక అధికారి శ్రీనివాసరావు, ఎంపీడీఓ బన్సీలాల్, డీఈ సురేష్, మండల విద్యాశాఖ అధికారి రాథోడ్, బీఆర్ఎస్ నాయకులు దశరథ్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పాదయాత్ర


వెంకటపాపయ్య నగర్‌లో పర్యటిస్తున్న బీజేపీ నాయకుడు యోగానంద్ తదితరులు

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ బస్టాప్‌లో బీజేపీ జెండాను శేరిలింగంపల్లి నియోజకవర్గ బీజేపీ నాయకుడు గజ్జెల యోగానంద్ బుధవారం ఆవిష్కరించారు. అనంతరం సమస్యలను తెలుసుకునేందుకు వెంకటపాపయ్యనగర్ వరకు పర్యటించారు. ఈ సందర్భంగా యోగానంద్ మాట్లాడుతూ ఎక్కడ చూసినా రోడ్లు లేవని, సరైన సమయంలో మంచి నీరు సరఫరా కావటం లేదని స్థానికులు ఆయన దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను ఎమ్మెల్యే, కార్పొరేటర్ల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించకపోవడంతో సొంత ఖర్చుతో డ్రైనేజీ బాగు చేసుకుంటున్నామని స్థానికులు తమ దృష్టికి తీసుకొచ్చారన్నారు. ప్రజా సమస్యలను పరిష్కరించడానికి బీజేపీ తలపెట్టిన మీ సమస్య.. మా పోరాటం ద్వారా త్వరలోనే వీటి నుంచి ప్రజలకు విముక్తి కల్పిస్తామని యోగానంద్ స్థానికులకు హామీ ఇచ్చారు.

నాణ్యతతో పనులు త్వరగా పూర్తి చేయాలి


రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రోజాదేవి తదితరులు

ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్ ముందు మాధవరం కాలనీ రోడ్డు కలుపుతూ వెళ్లే ప్రధాన రహదారిలో నాలాపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను బుధవారం కార్పొరేటర్ మాధవరం రోజాదేవి పరిశీలించారు. అనంతరం దీనబంధు కాలనీ నుంచి జగద్గిరిగుట్ట చౌరస్తా వరకు గల ప్రధాన రహదారిపై నిర్మిస్తున్న రోడ్డు పనులను పరిశీలించారు. పనులను నాణ్యతతో త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు, డివిజన్ అధ్యక్షుడు సంజీవ రెడ్డి, ఏఈ ఆశ, వర్క్ ఇన్‌స్పెక్టర్ గురువారెడ్డి, ఏఈ శరత్‌బాబు, ఆంజనేయులు, బాబు, చంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేటర్ పర్యటన

మియాపూర్: కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ మంజుల రఘునాథ్‌రెడ్డి పేర్కొన్నారు. డివిజన్ పరిధిలోని ఇంద్రానగర్ వీకర్ సెక్షన్ కాలనీలో అధికారులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ, సీసీ రోడ్డు వేయాలని కార్పొరేటర్ దృష్టికి కాలనీవాసులు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. కాలనీలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులు, సీసీ రోడ్డు నిర్మాణ పనుల నివేదికను రూపొందించాలని జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్ అధికారులను కోరారు. ఆమె వెంట చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథ్‌రెడ్డి, అధికారులు ఈఈ శ్రీకాంతిని,డీఈ ప్రవీణ్, ఏఈ సంతోష్, నాయకులు పాల్గొన్నారు.

అన్ని వర్గాలను సంతృప్తిపరిచే కేంద్ర బడ్జెట్


రవికుమార్‌యాదవ్

గచ్చిబౌలి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలను సంతృప్తి పరిచేలా ఉందని బీజేపీ రాష్ట్ర నాయకులు రవికుమార్‌యాదవ్ అన్నారు. బుధవారం కేంద్రబడ్జెట్‌పై ఆయన మాట్లాడారు.నిరుద్యోగుల కోసం నేషనల్ అప్రెంటిస్‌షిప్ స్కీమ్ తీసుకువస్తామని హామీ ఇవ్వడం సంతోషించదగ్గవిషయమన్నారు. యువతలో నైపుణ్యం పెంచే విధంగా ప్రధానమంత్రి కౌశల్ వికాస్ యోజన 4.0ను ప్రారంభిస్తామని చెప్పడం శుభపరిణామన్నారు. దేశవ్యాప్తంగా 157 కొత్త మెడికల్ కాలేజీలు ఏర్పాటు చేయడం చాలా గొప్ప విషయమన్నారు. ఇలా పేద, మధ్య తరగతి ప్రజలకు లబ్ధి చేకూరే విధంగా ఉందని హర్షం వ్యక్తం చేశారు.

అక్రమ నిర్మాణాల కూల్చివేత



మాదాపూర్: సర్వే ఆఫ్ ఇండియాలో భాగంగా అధికారులు మాదాపూర్‌లో బుధవారం అక్రమ నిర్మాణాలను కూల్చివేశారు. యజమానులు ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా నిర్మిస్తున్నారని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని అధికారులు తెలిపారు.

ఫొటోగ్రఫీ ఎడిటింగ్ షాపు ప్రారంభం

ఆల్విన్‌కాలనీ: ఆల్విన్‌కాలనీ ఫేజ్ వన్‌లో ఫొటోగ్రఫీ ఎడిటింగ్ షాపును బుధవారం శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్లు దొడ్ల వెంకటేష్ గౌడ్, మాధవరం రోజాదేవిలు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు.

సాగు భూమిని స్టోన్ క్రషర్లకు ఎలా అప్పగించారు?

పటాన్‌చెరు టౌన్: లక్డారం గ్రామ పరిధిలోని సర్వే నంబరు 747లో గల సాగు భూమిని ఎవరి అనుమతితో క్రషర్లకు అప్పగించారని బీజేపీ ఓబీసీ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీకాంత్ గౌడ్ ప్రశ్నించారు. బుధవారం పటాన్‌చెరు మండల పరిధిలోని లక్డారంలోని ఆ భూమిని రెవెన్యూ శాఖ ఆర్ఐ ఖాజా, రైతులతో పాటు కలసి సందర్శించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ అక్రమంగా రైతుల పొలాల్లోకి చొరబడి ఆక్రమించే ప్రయత్నం చేస్తూ సాగు కోసం రైతులు ఏర్పాటు చేసుకున్న వరి మడులను చెడగొట్టి నష్టం చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని, నిజమైన పట్టాదారులకు భూమి అప్పగించాలని ఆయన డిమాండ్ చేశారు. అధికారులు రైతులకు న్యాయం చేయకపోతే పటాన్‌చెరు తహసీల్దార్ కార్యాలయాన్ని బాధిత రైతులు, గ్రామ యువకులతో కలసి ముట్టడిస్తామని హెచ్చరించారు.

గుర్తుతెలియని మహిళ మృతదేహం లభ్యం

మియాపూర్ : గుర్తుతెలియని మహిళ మృతదేహం చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో లభ్యమైంది. లింగంపల్లిలోని నల్లగండ్ల ఫ్లైఓవర్ కింద గుర్తుతెలియని మహిళ(60) పడి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా ఆ మహిళ మృతి చెంది ఉంది. చుట్టుపక్కల ఆమె గురించి విచారించగా, యాచకురాలని స్థానికులు చెప్పారు. పోలీసులు మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బైక్ అదుపు తప్పి..ఒకరి మృతి

మియాపూర్: ద్విచక్రవాహనం అదుపు తప్పి కింద పడి ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ అహ్మద్‌పాషా తెలిపిన వివరాల ప్రకారం..ఒడిశాకు చెందిన సారంగతమిశ్ర(50) భార్య మీనతీమిస్రా, కుమారుడుతో కలిసి చందానగర్‌లోని నివాసముంటున్నాడు. సారంగతమిస్రా మీర్‌పేట్‌లో జిరాక్స్ సెంటర్ నడుపుతున్నాడు. ఈ క్రమంలో సారంగతమిస్రా తన బైక్‌పై పనిముగించుకుని ఇంటికి వస్తుండగా మదీనాగూడలోని జాతీయ రహదారి వద్ద చందానగర్ వైపు వెళుతుండగా, అదుపు తప్పింది. దీంతో డివైడర్‌పై పడి తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే దగ్గరలో ఉన్న ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం తెల్లవారు జామున మృతి చెందాడు. భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'మన ఊరు-మన బడి'తో రూపురేఖలు మారుతాయి


మార్తాండనగర్ ప్రభుత్వ పాఠశాలలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గాంధీ

- ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ
- మార్తాండనగర్ పాఠశాలలో రూ.4.02 లక్షలతో మౌలిక వసతులు

హఫీజ్‌పేట్ : తెలంగాణ రాష్ట్రంలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'మన ఊరు-మన బడి' కార్యక్రమంతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతాయని ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ పేర్కొన్నారు. బుధవారం కొండాపూర్ డివిజన్ పరిధిలోని మార్తాండనగర్ ప్రభుత్వ పాఠశాలలో సుమారు రూ.4.02 లక్షలతో మౌలిక వసతుల పనులను శేరిలింగంపల్లి మండల విద్యాధికారి వెంకటయ్య, మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన ఊరు-మన బడి ద్వారా అధునాతన సౌకర్యాలు కల్పిస్తున్నామన్నారు. చూడముచ్చటైన తరగతి గదులు, క్లాస్ రూమ్‌లలో డ్యూయల్ డెస్క్‌లు, మరుగుదొడ్లు, మంచినీరు, ట్యాంక్‌లు, వంటగదులు, భోజనశాలలు, వాకింగ్ ట్రాక్‌లు, ప్రహరి గోడ తదితర సదుపాయాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని శేరిలింగంపల్లి మండలంలో 24, కూకట్‌పల్లి మండలంలో 7 మొత్తం 31 ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులను కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈఈ కుమార్ గౌడ్, మియాపూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు కె.వసుంధర, స్థానిక పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ వి.ఈశ్వరి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఐ.శ్రీలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆదిల్ పటేల్, రాజు యాదవ్, శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

శేరిలింగంపల్లి హైస్కూల్‌లో సహాయ నిరాకరణ


హెచ్‌ఎం శంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న భాషాపండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు

శేరిలింగంపల్లి: భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయులు జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుతో శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో సహాయ నిరాకణకు దిగారు. బుధవారం శేరిలింగంపల్లి హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎల్.శంకర్‌కు సహాయ నిరాకరణ చేస్తున్నట్లు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇరవై ఏళ్లుగా ప్రమోషన్స్ లేవన్నారు. ప్రపంచ తెలుగు మహాసభల సమయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ భాషా పండితులు, పీఈటీలకు పదోన్నతులపై హామీ ఇచ్చారన్న విషయాన్ని గుర్తు చేశారు. సహాయ నిరాకరణలో భాగంగా 9,10 తరగతులకు బోధన నిలిపివేస్తామని ప్రధానోపాధ్యాయుడి దృష్టికి తీసుకెళ్లారు. భాషా పండితులు బి.రాజయ్య, శారద, యా దమ్మ, అనంతయ్య, గోపాల్ పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు.. పల్లకీసేవ

రాయదుర్గం: నానక్‌రాంగూడ ఐటీ కారిడార్‌లో వెలసిన రంగనాథస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా సాగుతున్నాయి. బుధవారం ఆలయంలో బాలభోగం, అర్చన, బలిహరణ, ఆరాధన కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణం చేశారు. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో పల్లకీసేవ కార్యక్రమాన్ని కన్నుల పండువగా, భక్తుల జయజయధ్వానాల మధ్య నిర్వహించారు. అంతకుముందు ఆలయ ప్రాంగణంలో రంగనాథస్వామికి ప్రత్యేక అభిషేకం చేశారు.

రేపు రథోత్సవం ..
నానక్‌రాంగూడలోని రంగనాథస్వామి ఆలయంలో ప్రధాన ఘట్టంగా పేర్కొనే రథోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. పురాతన రథాన్ని సిద్ధం చేస్తున్నారు.


రాయదుర్గంలో ..

రాయదుర్గంలోని వెంకటేశ్వరస్వామి ఆలయ బ్రహ్మోత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. స్వామివారికి అర్చన, ఆరాధన, అభిషేకం చేశారు. కాగా బ్రహ్మోత్సవాల ప్రారంభంలో పుట్టమట్టి తెచ్చే కార్యక్రమాన్ని అర్చకుల వేద మంత్రోచ్చారణల మధ్య మట్టిని తీసుకొని ఆలయానికి వచ్చి పూజలు చేశారు.

ఘనంగా వీరాంజనేయ శివాలయం 16వ వార్షికోత్సవం


వార్షికోత్సవంలో పాల్గొన్న ఎమ్మెల్యే గాంధీ

ఆల్విన్‌కాలనీ: పాపిరెడ్డినగర్‌లోని శ్రీ వీరాంజనేయ శివాలయం 16వ వార్షికోత్సవం బుధవారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు పరాంకుశం వెంకటాచారి, గంగాధర్‌లు నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నదానం, సాయంత్రం స్వామివార్ల ఊరేగింపు కనుల పండువగా సాగాయి. ఈ వేడుకల్లో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే గాంధీ, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ, జగద్గిరిగుట్ట సీఐ సైదులు పాల్గొన్నారు.కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గడ్డం రాజేశ్వర్‌రెడ్డి, అధ్యక్షుడు ధర్మారావు, ప్రధాన కార్యదర్శి దొడ్ల రాంరెడ్డి, కోశాధికారి కిరణ్, బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి, ప్రధాన కార్యదర్శి భగవంత్‌రెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, చిట్టిరెడ్డి శ్రీధర్‌రెడ్డి హన్మంత్‌రెడ్డి, కనకారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చెట్టును ఢీ కొన్న టిప్పర్


ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్ మెట్టుకుమార్

పటాన్‌చెరు టౌన్: టిప్పర్ లారీ అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. ఈ ఘటనలో ఎంజీ రోడ్డు పక్కనే ఉన్న విద్యుత్ స్తంభం విరిగిపోయిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్ ఘటన స్థలానికి చేరుకొని విద్యుత్ శాఖ, జీహెచ్‌ఎంసీ సిబ్బందికి సమాచారం ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిత్యం రద్దీగా ఉండే రోడ్ల పక్కన ఏపుగా పెరిగే చెట్లతో ప్రమాదాలు జరగకుండా ఎప్పటికప్పుడు కొమ్మలను కత్తిరించాలన్నారు.

వీల్‌చైర్ అందజేత
బిహార్ నుంచి బతుకుదెరువు కోసం వచ్చిన కృష్ణ పటాన్‌చెరులో ఉంటూ సికింద్రాబాద్‌లోని ఓ కెమికల్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఇటీవల ప్రమాదానికి గురైన ఘటనలో కాలు విరిగింది. దీంతో వైద్యులు నడవడం సాధ్యం కాదని చెప్పారు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న కార్పొరేటర్ మెట్టుకుమార్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు అఫ్జల్ బుధవారం బాధితున్ని పరామర్శించారు. అనంతరం వీల్ చైర్‌ను అందించారు.

భీమునికుంట చెరువు పరిశీలన


భీమునికుంటలో సీవరేజ్ నీరు కలుస్తున్న ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని భీముని కుంట చెరువులోకి సీవరేజ్ నీరు కలుస్తోందని తెలుసుకున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు ,ఇరిగేషన్, ఇంజినీరింగ్ అధికారులతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... డ్రైనేజీ సమస్య పరిష్కారమే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నామని అన్నారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు మొదటి ప్రాధాన్యం ఇస్తున్నామని తెలిపారు. అభివృద్ధి పనుల నాణ్యతలో రాజీ పడకుండా చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఇరిగేషన్ ఏఈ విశ్వం, జీహెచ్‌ఎంసీ ఏఈ రాజీవ్, వర్కు ఇన్‌స్పెక్టర్ మహదేవ్, నాయకులు పోతుల రాజేందర్, కుమారస్వామి, రాజుసాగర్ తదితరులు పాల్గొన్నారు.